# సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు

## కలువకొలను సదానంద

శేఖరం మేష్టారి యింటి ముందర మల్లె పందిరిలో పువ్వులు కోసుకుంటోంది సీత. శేఖరం కొడుకు ఐదేళ్ళరవి కూడా చేతికందిన పువ్వులు కోసి సీత ఒడిలో వేస్తున్నాడు. ఇంటివాకిట పూచిన పువ్వుల్ని సిగలో తురుముకోటానికి శేఖరం యింట్లో యిప్పుడెవరూ లేరు. అతడి భార్య శారద ఏడాదికిందట పాము కాటుకు గురై చనిపోయింది. ఇల్లాలు లేక మోడుబారిపోయినట్లున్న ఆ యింటి లోగిలిలో విరగబూచే మల్లెలన్నీ నేలరాలిపోయేవే! అవి అలా వృధాగా రాలిపోకుండా తాను కోసుకుపోవటం సీతకు అలవాటు!

శేఖరం చేదబావి దగ్గరికి ఏవో రెండు గిన్నెలు తెచ్చి కడుక్కుని వంటింట్లోకి వెళ్ళాడు. తువ్వాలుతో చేతులు తుడుచుకుంటూ వచ్చి, నిర్వికారంగా సీత వైపు చూస్తూ, పెంకుటింటి అరుగుపైన కూర్చున్నాడు. "నిన్ను చూట్టానికి రేపెవరో వస్తున్నారట కదసీతా?" అన్నాడు.

సీత అతడివైపు చూసి చిరునవ్వు నవ్వి "మా చెల్లాయిని చూట్టానిక్కూడా!" అంది.

"అంటే, యిద్దరొస్తున్నారా?"

"ఊహుఁ! ఒక్కరే!"

"అదేమిటీ?"

"అదంతే మాష్టారూ! మా నాన్న మమ్మల్ని పెద్ద సస్పెన్స్‌లో పెట్టేశాడు. మా యిద్దర్లో ఒకర్ని రేపొచ్చే అబ్బాయికిస్తాట్ట, మరొకర్ని మా బావకిస్తాట్ట! తన మొగుడెవరో కచ్చితంగా తేలక మా చెల్లాయి తల బద్దలై పోతోందంటే నమ్మండి."

"అయితే నీ తల బద్దలు కావటం లేదన్న మాట?"

"ఆ చిక్కు నాకు లేదులెండి. నాది మట్టి బుర్ర కదా? మా నాన్న ఏదో ఒక మీట నొక్కేవరకూ నా బుర్ర ఖాళీగానే వుంటుంది." అంటూ మల్లెపందిరిలో తనూ ఒక పువ్వులా స్వచ్ఛంగా నవ్వింది సీత.

పువ్వులు కోయటం ముగించి ఆమె మెల్లగా వంటింట్లోకి వెళ్ళింది. పెద్ద స్టీలు గిన్నె ఒకటి వెతికి తీసుకుని, ఒడిలోని పువ్వుల్ని అందులో కుమ్మరించింది. స్టవ్‌మీద అన్నం వుడుకుతున్నది. ఒకటి రెండు గిన్నెల మీది మూతల్ని తీసి చూసింది సీత ఉదయంచేసిన కూరలేవో కొద్దిగా వున్నాయి వాటిలో. మూతల్ని యథాప్రకారం సర్ది, పూలగిన్నెను చేతి కెత్తుకుని, "వెళ్ళొస్తా మాస్టారూ!" అంటూ బయటికి నడిచింది. రవి భుజం మీద చెయ్యి వేసుకుని వీధి వాకిలి దాకా వెళ్ళి, "ఆనక మా యింటికి రా రవీ! కూరలు తెచ్చుకుందువుగానీ!" అంటూ వాడి బుగ్గ నిమిరి మూడిళ్ళ కవతలున్న తన యింటికేసి నడిచింది.

సంసార మహాసాగరాన్ని చాకచక్యంగా ఈదగలిగే వాళ్ళు కొందరే వుంటారు. ఆ కొందరిలో ఒకడు సోమయాజులు. కొడుకూ, ముగ్గురు కూతుళ్ళూ ఎదిగొచ్చేలోపల చిత్తూరు నంతపేటలో పోరంబోకు జాగాలో రెండు పూరిళ్ళు కట్టుకుని జీవితంలో స్థిరపడ్డాడు. రెండు మైళ్ళ దూరంలో కొండవాలులో మూడెకరాల బంజరు భూమిని స్వంతం చేసుకోగలిగాడు ఉద్యోగంలో వచ్చే నాలుగు రాళ్ళనూ పొట్టకూటికీ, పిల్లల చదువులకీ సరిపెట్టి, ఎలిమెంటరీ స్కూల్ హెడ్మాస్టరుగా రిటైర్ అయ్యేనాటికి కొండవాలులో పండించిన వానాకాలపు పంట రాబడినీ, భార్య శేషమ్మ పాడియావుమేపి పాలమ్మి కూడబెట్టిన డబ్బుల్నీ వెనకేసుకోగలిగాడు. కొడుకు జయరాం ఎమ్మెస్సీ పూర్తిచేసి ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తూ అనంతపురంలో వున్నాడు. ఉద్యోగ ప్రయత్నం ఫలించగానే యిప్పుడు చిత్తూరికి బదిలీ చేయించుకునే ప్రయత్నంలో పడ్డాడు. కూతుళ్ళకు పెళ్ళిళ్ళు చెయ్యాల్సిన అదను రాగానే, సన్నాహాలకు శ్రీకారం చుట్టాడు సోమయాజులు.

ఆఖరిపిల్ల అమరేశ్వరి యింకా తొమ్మిదో తరగతి చదువుకుంటోంది. దాన్ని గురించి యిప్పుడు బెంగలేదు. దాని అక్కలిద్దరూ పదో తరగతి వరకూ చదువుకుని, కుంతలో పెట్టిన బంగినపల్లి మామిడికాయల్లా యింట్లోనే వున్నారు. ఆ కాయలిప్పుడు పండి పక్వాని కొచ్చేశాయి. సీతకు యిరవై రెండేళ్ళు. రమణికి పద్దెనిమిదేళ్ళు. సీతకు ఎప్పుడో పెళ్ళిచేసి వుండొచ్చు. కానీ, యిద్దరికీ ఒక్కసారిగా చేస్తే బోలెడంత ఖర్చు తగ్గుతుందని యింతకాలమూ ఆగాడు సోమయాజులు.

ఊరికి రెండో అంచున వున్న గిరింపేటలో, సోమయాజులుకు చెల్లినిచ్చిన శ్రీనివాసులున్నాడు. అతని కొడుకు ఆనందకృష్ణ ఎలెక్ట్రిసిటీ బోర్డులో హెల్పర్. ఈ మేనరికం సోమయాజులు పాలిటికి సిద్ధాన్నం లాంటిది! మరో కొత్త సంబంధం కుదరాలేకానీ, రెండు పెళ్ళిళ్ళూ ఒక్క ముహూర్తంలో జరిగిపోవడం ఎంతసేపు?

మేనల్లుడికి కట్నం యిచ్చే ప్రసక్తిలేదుగానీ

**ఏ అమ్మాయిని ఏ అబ్బాయికివ్వాలన్న విషయంలో అనిశ్చితిస్థితి ఏర్పడింది సోమయాజులుకు. ఇంటికి ఏ మేనకోడలొచ్చినా శ్రీనివాసులుకేమీ పట్టింపులేదు. రామకోటికి ఏ పిల్లనివ్వాలి? తొందరపడటం తగదు.**

కొత్తల్లుడికి కాస్తో కూస్తో ముట్టజెప్పక తప్పదు కదా? పిల్లనిమ్మని అడిగిన ప్రతివాడి నోట్లోనూ పదునాలుగు లోకాలమేర విస్తరించుకున్న కట్నాల రేట్ల అనంతరూపాన్ని చూసిచూసి సోమయాజులు గుండెలవిసిపోయాయి. స్వర్గలోకాన్నయినా జయించవచ్చునేమోగానీ ఆడపిల్లకు పెళ్ళి చెయ్యటం అసాధ్యం అన్న నిరాశకు లోనైపోతున్న సమయంలో ఒక సంబంధం కలిసి వచ్చింది.

అబ్బాయి పేరు రామకోటి. తిప్పసముద్రంలో సీనియర్ తెలుగు పండిట్‌గా పనిచేస్తున్నాడు.




వయస్సు ముప్పైయ్యేళ్ళు. ఇంతకాలంగా పెళ్ళి ఎందుకు కాలేదన్న అనుమానాన్ని నివృత్తిచేస్తూ అబ్బాయి తండ్రి అన్న మాటలివి–

“దాదాపు ముప్పై సంబంధాలు చూశాం బావగారూ! ఒక్కటీ మాకు నచ్చలేదు. అందం కొరుక్కుతినటానికా, అంతస్తు వూరేగటానికా? సంప్రదాయం ముఖ్యంకదా? ఏమంటారు? వియ్యమందటం అంటూ జరిగితే, అది మీతోనే జరగాలి. కట్నాలూ కానుకలే ముఖ్యమనుకుని వుంటే మావాడెప్పుడో ఒక యింటివాడై వుండేవాడు. మాక్కావల్సింది మీ అమ్మాయి. అబ్బాయికి సూటుకూ, గడియారానికీ వెయ్యిన్నూటపదార్లిచ్చి పెళ్ళి జరిపించండి, చాలు!”

ఈ మాటలకు ఉబ్బితబ్బిబ్బైపోయినందువల్ల మాత్రమే సోమయాజులు తల ఒగ్గాడని చెప్పలేము. అతడు తిప్పసముద్రం వెళ్ళి, రామకోటి అవిటి కాలిని విసురుకుంటూ నడుం ఎగరేస్తూ నడవటాన్ని కళ్ళారా చూశాడు కూడా. తన అరవై ఏళ్ళ జీవితానుభవంతో కర్తవ్యాన్ని గురించి ఆలోచించాడతను. ఊరేగే దేవుడి పూల తేరు కాదు జీవితం. ఎక్కడో ఏదో లోటు వుంటూనే వుంటుంది. ఆ లోటుపట్ల వైముఖ్యం ప్రకటించి దూరంగానే నిలబడిపోతే, ఆ నిలబడ్డచోట ఇతర సుఖాలన్నీ కరువైపోవచ్చు! ఆర్థిక దృష్టితో చూసినప్పుడు–కట్టుకున్న పిల్ల సుఖపడటానికీ, కట్టబెట్టే తండ్రి తృప్తిగా బరువు దించుకోటానికీ తగినచోటు యిదే!

ఏ అమ్మాయిని ఏ అబ్బాయికివ్వాలన్న విషయంలో అనిశ్చితిస్థితి ఏర్పడింది సోమయాజులుకు. ఇంటికి ఏ మేనకోడలొచ్చినా శ్రీనివాసులుకేమి

పట్టించుకోలేదు. రామకోటికి ఏ పిల్లనివ్వాలి ? కూతుళ్ళిద్దరూ తన మాటకు ఎదురుచెప్పరన్న నమ్మకం సోమయాజులుకుంది. అలాగని తాను తొందరపడటం తగదు. ఇది నిదానంగా ఆలోచించి నిర్ణయించవలసిన విషయం.

"అబ్బాయిలతో కలిసి పెళ్ళిచూపులకు రండి. మనం వియ్యంకులం కావటమే దైవనిర్ణయమైతే, ఒకమ్మాయిని మీకిస్తాను" అన్నాడు సోమయాజులు రామకోటి తండ్రితో.

ఇంటికొచ్చి పెళ్ళాం పిల్లలతో తిప్పసముద్రం సంగతులు చెప్పి ముగించగానే, చిన్న పిల్ల అమరేశ్వరి ప్రొజెక్టర్ చెడిపోయి సినిమా ఆఖరి రీలు చూడలేకపోయినదానిలా ముఖం చిట్లించుకుంటూ, "ఏమిటి నాన్నా ఇది, లాటరీ టిక్కెట్లు కొనుక్కున్నట్లు! సీతక్క మొగుడెవరో, రమణక్క మొగుడెవరో చెప్పకపోతే ఎలా ?" అంది.

"నువ్వు నోరు మూసుకోవమ్మా! అక్కలంత లేని తొందర నీకెందుకు ?" అన్నాడు సోమయాజులు.

అయినా అది నోరు మూసుకోదుకదా! దాని ఉత్కంఠకు కళ్ళేలంటూ వుండేకదా ? బడి నుంచి యింటికి రావడమే తడవుగా వంటింట్లోకి దూరి, "అమ్మా ! నాన్న పొదుపు కథ విప్పారా లేదా ?" అని అడిగింది. "అమ్మా! ఒక పని చేద్దామే! అక్కలకూ బావలకూ కళ్ళకు గంతలు కట్టి ఈలవేద్దాం. ఎవరికి ఎవరు దొరుకుతారో వాళ్ళకు పెళ్ళి చేసేద్దాం" అంటుంది.

ఆ సాయంకాలం మరో గమ్మత్తు చేసింది అమరేశ్వరి. వాకిట్లో సిరిచాప పరుచుకుని, శేఖరం మేష్టారింట్లోనుంచి కోసుకొచ్చిన పువ్వుల్ని దండ లల్లుకుంటున్నారు సీతా, రమణీ. చుట్టచుట్టిన రెండు చీటీలను వాళ్ళమధ్య పడవేసి, "చెరొకటి తీసుకోండి!" అంది అమరేశ్వరి.

రమణి ఒక చీటీ తీసుకుంది.

"నువ్వు కూడా తీసుకో సీతక్కా !" అంది అమరేశ్వరి.



## ఒక చేతితో....

"ఒక చేతితో డ్రైవ్ చెయ్యగలవా ?" డ్రైవర్ని ఆఫీసర్ రామనాథం అడిగాడు.


"ఓ" అన్నాడు డ్రైవర్ సంతోషంగా.

"అయితే ఒక చేతితో డ్రైవ్ చేస్తూ... రెండో చేతితో నీ ముక్కు తుడుచుకో !" సలహా ఇచ్చాడు రామనాథం.

—గురు (హైద్రాబాద్)

జయదేవ్
ఎల్యూనారాయణ్రావ్

(గత సంచిక తరువాయి)




ప్రక్క పేజీ చూడండి.



## ఎందుకు ?

"ఎన్నికలలో ముగ్గురు హేమాహేమీలు నిలబడితే, మధ్యలో మీరెందుకు పోటీ చేస్తున్నారు?" అడిగాడుసుబ్బయ్య రంగయ్యని.

"ఓడిపోయిన మిగతా ఇద్దరి హేమాహేమిలతో నేనూ సమానమవుతాను గనక" అన్నాడు రంగయ్య.

—ఎన్. సత్యనారాయణ (గడసాం)

"ఏమిటే యిది?" అంటూ సీత రెండో చీటీ అందుకుంది.

"విప్పి చూసుకోండి, మీ మొగుళ్ళ పేర్లు!"

రమణి చీటీలో రామకోటి పేరూ, సీత చీటిలో ఆనందకృష్ణ పేరూ వున్నాయి. రమణి భద్రకాళి అయిపోయింది. కసితీరా అమరేశ్వరి నెత్తిన ఒక్క పోటుపొడిచి, అక్కణ్ణుంచి లేచి ఇంట్లోకి వెళ్ళిపోయింది. నెత్తి పట్టుకుని ఏడుస్తూ కూర్చున్న అమరేశ్వరిని సీత లాలించబోగా, మందలించింది.

మరునాడు రామకోటి, అతని తల్లిదండ్రులూ రానే వచ్చారు. అమ్మాయిల్ని చూశారు. "బావగారూ! మా వేట ఇంతటితో పూర్తయిపోయింది. మావాడికి అత్తగారిల్లు ఇదే!" అనేశాడు రామకోటి తండ్రి.

ఇంటి లోపల కూర్చునివున్న ఇద్దరు కూతుళ్ళనూ సమీపించాడు సోమయాజులు.

"ఏమమ్మా! ఆ అబ్బాయిని ఎవరు చేసుకుంటారు?" అని మొదట రమణిని అడిగాడు.

రమణి నోరు విప్పలేదు.

"చెప్పమ్మా!"

ఆమె సీతవైపు చూసింది.

సీతవైపు తిరిగి, "నువ్వేమంటావమ్మా?" అన్నాడు సోమయాజులు.

సీత తల వంచుకునే, "నీ యిష్టం నాన్నా!" అంది.


తండ్రి బయటకు వెళ్ళగానే రమణి అక్కకు దగ్గరగా జరిగి ఆమె ముఖంలోకి వొంగి చూసి, "అక్కా!" అంది. 'నిజంగా ఆ అబ్బాయిని చేసుకుంటావా?' అన్న ప్రశ్న ఆ పిలుపులో ధ్వనించింది.

"మనిద్దరిలో ఎవరో ఒకరు చేసుకోక తప్పదు కదా మరి!" అంటూ చిరునవ్వు నవ్వింది సీత.

సీత సౌజన్యాన్ని గురించి సోమయాజులుకు బాగా తెలుసు. ఆమె సౌమ్యురాలు. సర్దుకుపోయే స్వభావం కలది. రామకోటికి చిన్నమ్మాయిని కాక పెద్దమ్మాయినివ్వటమే వివేకవంతమైన పనిగా, తోచిందతనికి. తన నిర్ణయాన్ని వియ్యాలవారికి తెలియజేశారు. పదిరోజుల తరువాత ఫలానారోజున వచ్చి నిశ్చయ తాంబూలాలు పుచ్చుకుందామని చెప్పి, సంతోషంగా వెళ్ళిపోయారు వియ్యాలవారు.

సోమయాజులు పెళ్ళి సన్నాహాలలో పడ్డారు. అమ్మాయిలిద్దరికీ కమ్మలూ, లోలకులూ, ముక్కుపుడకలూ వున్నాయి, మూడేసి నవరాలతో చెరొక నెక్లేస్ చేయించి, మేనల్లుడికి కూడా వెయ్యిన్నూట పదార్లిచ్చి నిరాడంబరంగా తంతు పూర్తి చేద్దామనుకున్నాడతను.

రమణి ముఖంలోకి వెయ్యి పెళ్ళిళ్ళ కళ వొచ్చేసింది. గిరింపేటనుంచి ఆనందకృష్ణ చీటికీ మాటికీ మామగారింటికి రావటం ప్రారంభించాడు.




ప్రక్కపేజీ చూడండి

రమణి అమరేశ్వరిని తోడు తీసుకుని, బావతో కలిసి రెండుమూడు మేట్నీలుకూడా చూసేసింది.

రామకోటి వచ్చి పిల్లను చూసి వెళ్ళిన తరువాత నాలుగు రోజులకు, అతడి అప్పచెల్లెలినంటూ ఒకావిడ సంతపేట కొచ్చింది. పెళ్ళిచూపులకు తాను రాలేకపోయాననీ, తాను లేకుండా పిల్లను చూడటమేమిటనీ తెగవాగింది. అమ్మాయిన్ని చూసింది. "మా వాడికి రెండో అమ్మాయిని కదా యివ్వాల్సింది?" అంటూ బుగ్గలు నొక్కుకుంది. "వెళ్ళొస్తానండీ మామగారూ!" అంటూ ఒయ్యారాలను రోడ్డుమీద పరుచుకుంటూ వెళ్ళిపోయింది.

వెళ్ళొస్తానని చెప్పి ఆమె తనమాట నిలబెట్టుకుంది. తండ్రిని వెంటబెట్టుకుని మర్నాడు మళ్ళీ వచ్చిందామె. "బావగారూ! మా వాడు మీ రెండో అమ్మాయినే కావాలంటున్నాడు. ఎలాగూ మీ అల్లుడై పోయాడు. మీరు వాడి ముచ్చట తీర్చక తప్పదు" అన్నాడు రామకోటి తండ్రి.

"ఇప్పుడెలాగండీ..." అంటూ నీళ్ళు నమిలాడు సోమయాజులు.

"ఇక మీరేమీ ఆలోచించకండి. మీ మేనల్లుడికి పిల్లనివ్వద్దని మేము అనటం లేదుకదా? పెద్ద పిల్లను వాళ్ళకివ్వండి. చిన్నపిల్లను మాకివ్వండి. లేకపోతే మా వాడు ఈ జన్మలో పెళ్ళి చేసుకునేట్టు లేదు" అంటూ మాటలతో సోమయాజుల్ని అప్రతిభుణ్ణి చేసి, అతడిచేత సరే అనిపించుకుని వాళ్ళు వెళ్ళిపోయారు.

వాళ్ళు రమణిని కావాలన్నారంటే, దానిఅర్థం సీత బాగుండదని కాదు. లేప్రాయంలో వున్న రమణి అక్క కంటే ఆకర్షణీయంగా, చలాకీగా కనిపిస్తుంటుంది.

రమణి ముఖంలోని పెళ్ళికళంతా తృటిలోనే కొల్లబోయింది. బెంగగా వున్న కూతుర్ని వూరడించడానికి ఇలా హితోపదేశం చేశారు సోమయాజులు "చూడు తల్లీ! మీ మంచి చెడ్డలు నాకు కాకుంటే, మరెవరికి కావాలి? ఇప్పుడు మనసుకు కష్టంగా వున్నా, రేపటి సుఖం కూడా ఆలోచించాలి కదా? ఆ అబ్బాయికి ఏం తక్కువైందని? కాలు సొట్టంటావా? కాలితో పనేముంది? అబ్బాయి గౌరవమైన ఉద్యోగంలో ఉన్నాడు. మంచి జీతం వొస్తుంది. కోరిన తిండీ తినొచ్చు. కోరిన బట్ట కట్టొచ్చు, చూచేవాళ్ళు కన్ను కుట్టేలా సుఖంగా బతకొచ్చు. బావ మంచివాడైతే సరిపోయిందా? అది పెద్ద కుటుంబం. తేనేపల్లి మంద. బావలూ మరదులూ, ఆడబిడ్డలూ చిన్నమామలూ, చిన్నత్తలూ పొలుచుకు తినేస్తారు. ఆ బండచాకిరీ అక్క నెత్తినేసుకుంటుంది గానీ, నీకొద్దమ్మా"



### తెలుగు


"మద్రాసు వెళ్ళావనుకో... టాక్సీ ఎక్కావనుకో... టాక్సీవాడికి తెలుగు వచ్చో రాదో తెలుసుకోడం ఎలా?" అడిగాడు రమేష్, సురేష్‌ని.

"సింపుల్. వాడ్ని తెలుగులో తిట్టు. అంతే" చెప్పాడు సురేష్.

-సి. హెచ్. లక్ష్మీప్రియ (నందిగామ)

కథ ఇక్కడి కొచ్చేసరికి అమరేశ్వరి పేర్లు రాసి అందించిన చీటీల జోస్యమే స్థిరపడిపోయింది.

మరో వారం రోజులు గడిచిపోయాయి. ఇంతలో ఇక్కడేం జరిగిందో తిప్ప సముద్రం




ప్రక్కపేజీ చూడండి..



**కబుర్లు**

ఇద్దరు ఆడవాళ్ళు కుళాయిదగ్గర ఇలా మాట్లాడుకుంటున్నారు.

"రాత్రి సినిమాకి మీరు రాలేదుగాని వదిన గారు; మహబావుంది. జనం బానే వచ్చారు. సగం హాలు నిండింది"

"పోదురూ! మీ కబుర్లకేం? సగం హాలంతా ఖాళీయేనట...మావారు చెప్పారు"

—కె. గోపాలకృష్ణ (ఆత్మకూరు)

వాళ్ళకు తెలియదు. నిశ్చయతాంబూలాలు మార్చుకోటానికి నిర్ణీత దినాన వాళ్ల పుష్పక విమానంలా సంతపేటలో దిగారు. రమణిని వెతికి వాటేసుకోవటానికి రామకోటికంటే ఎక్కువగా వేగిరపడిపోతున్న అతడి అప్పచెల్లెళ్ళి అదుపులో పెట్టడానికి సతమతమైపోతూ సోమయాజులు వాళ్ళకు నంజాయిషీ చెప్పుకున్నాడు.

రమణీ, ఆనందకృష్ణ గుట్టు చప్పుడుకాకుండా క్రితంరోజు తిరుపతికి వెళ్ళి బాలాజీ సన్నిధిలో పూలదండలు మార్చుకుని, తిప్ప సముద్రం వాళ్ళ పుష్పక విమానం సంతపేటలో దిగిన ముహూర్తంలోనే గిరింపేటలో బంధుకోటి నడుమ కొలువుతీరి వీరపూజలందుకుంటున్నారు. అనంతపురం నుంచి వచ్చిన జయరాం ఆ వీరపూజల్లో పాల్గొని, అప్పుడే ఇంటికొచ్చాడు.

ఆ సాయంకాలం చెట్లమీద కాకులింకా వాల లేదు. కోపతాపాలతో అతలాకుతలమై పోయిన తిప్పసముద్రం వాళ్ల కాకుల్ని తలపింపజేస్తూ సోమయాజులు ఇంటి దాపులనున్న చింతచెట్ల క్రింద మూగారు.

కొంత సేపటికి ఆ దండు శాంతించిందేమో, హోరు తగ్గింది. మొదట రామకోటి తండ్రిఇంట్లో కొచ్చాడు. "జరిగిందేదో జరిగిపోయింది. ఇందులో మిమ్మల్ని తప్పుపట్టటం సబబుగా తోచటం లేదు నాకు. మనం మనం వియ్యంకులమే కదా? మాకేమి మనస్తాపంలేదు. ఎటూ ఈ రోజు తాంబూలాలిచ్చి పుచ్చుకుందామనుకున్నామూ, అతంతేదో జరిగిపోవటం మంచిది. మావాడు మీ పెద్దమ్మాయిని చేసుకుంటానంటున్నాడు. పురోహితుణ్ణి పిలిపించండి" అన్నాడు.

మరుక్షణం సోమయాజులు ఇంటిలోగిలి తిప్పసముద్రం వాళ్ళతో కిక్కిరిసిపోయింది.

కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ ఇంట్లో మూల కూర్చున్నది సీత. "ఏమైందమ్మా?" అన్నాడు సోమయాజులు


"నన్ను మనిషనుకున్నావా, మట్టిబొమ్మనుకున్నావా నాన్నా"

"ఇప్పుడు నేనేం చేశానని?"

"ఇంతా ఏం చెయ్యాలి? నా మనసుతో మాటి మాటికీ ఎందుకలా పటాలు మారుస్తావు? మొదట ఆ అబ్బాయిని చేసుకోమన్నావు. నేను కాదన్నానా మళ్ళీ ఆయనొద్దు—బావను చేసుకో అన్నావు. బదులు చెప్పానా? ఇప్పుడు బావలేదు, ఆ అబ్బాయే అంటున్నావు. మొగుడనే వాడు కట్టుకోటానికా, మనసులో పెట్టుకోటానికా అర్థం గాకుండా వుంది నాకు"

"కట్టుకున్న తరవాతే మనసులో పెట్టుకోవచ్చుగదమ్మా" అని హితవుచెప్పి, వంటింట్లో వున్న భార్యవద్దకు వెళ్ళాడు సోమయాజులు.

తండ్రిమీద జాలితప్ప మరేమీ తెలియనిసీతకు ఇప్పుడు రామకోటిమీద అణచుకోలేనంత అసహ్యం ఏర్పడింది. అతడికంటే శేఖరం మేష్టారు కోటిరెట్లు మెరుగ్గా కనిపించాడామెకు.



పాతజ్ఞాపకాలు కొన్ని ఆ క్షణంలో మధుర స్మృతులయి ఆమె కళ్ళ ఎదుట నిలిచాయి.

రెండేళ్ళ క్రితం ఒకనాటి సాయంకాలం శేఖరం మేష్టారింట్లో సీతకు పువ్వులజడ వేస్తోంది శారద. అప్పుడు ఇంటికొచ్చిన శేఖరం సీతవైపు చూసి "పెళ్ళికూతురిలా వుంది" అన్నాడు. శారద అప్పుడన్నమాటకు సీత ఒళ్ళు ఇప్పుడు పులకరించింది.

"మీరు కట్టుకుంటారా చెప్పండి. ఇంటి ముందర ఇప్పుడే పందిరేయిస్తాను"

పాపం, శారదక్క చనిపోయింది.

రెణ్నెల్ల క్రితం పండుగపూట ఏవో పిండి వంటలు తీసుకుని శేఖరం ఇంటికి వెళ్ళింది సీత. చేతి వేళ్ళకు బర్నాల్ రాసుకుంటున్నాడతను. "ఏమైంది మాష్టారూ?" అని అడిగింది తాను.

"అన్నం వారుస్తుంటే గంజి వొలికిపోయింది"

సీత గుండె కొద్దిగా కదిలింది. "ఏం బాధ లొచ్చాయండీ మీకు"

కొంచెతనం ఏ మాత్రమూ లేని చూపొకటి విసిరి "నువ్వు నన్ను పెళ్ళి చేసుకోరాదూ? ఈ బాధలన్నీ తప్పిపోతాయి కదా!" అన్నాడు శేఖరం.

"పొండి మాష్టారూ! మీకింతా చిలిపితనం పోలేదు" అంటూ చిరునవ్వును దాచనివ్వకుండా పెదాలతో అదిమిపట్టుకుంది సీత.

అప్పుడు అదిమిపట్టుకున్న ఆ చిరునవ్వే ఇప్పుడు పెదాల పట్టునడలించుకుని పువ్వులా జారిపడింది.

సీత కన్నీళ్లు తుడుచుకుని సైకిలెక్కింది.

శేఖరం మేష్టారు ఎండిపోయినకూరల్ని పెరట్లో పారబోస్తున్నాడు. వాకిట్లో ప్రత్యక్షమైన సీతను చూసి, "ఏం సీతా?" అన్నాడు.

ఆమె మల్లెచెట్టువైపు చూసింది. వారం రోజులుగా పాదులో ఎవరూ నీళ్ల పోయలేదేమో, అది వాడిపోయి వుంది. సీత బావిలో నుంచి బొక్కెట్టు నీళ్ళుతోడి మల్లె పాదుకు పోస్తూ. "అక్క చచ్చిపోతే ఈ మల్లెచెట్టు కూడా ఎండిపోవాలా మాస్టారూ?" అంది. బొక్కెట్టునుతెచ్చి బావి దగ్గర పెట్టి. సిగ్గుతో చిగురుటాకులా చలించిపోతూ. "మాస్టారూ! నన్ను పెళ్ళి చేసుకుంటావా సీతా అని మీరొకసారి అడిగారు. ఆ మాట మీరు నిజంగా అన్నారో, హాస్యానికన్నారో ఇప్పుడు నేను తెలుసుకోవాలి. ఇంకో అరగంటలో మా అన్నయ్యతో చెప్పండి చాలు. నేను విధికి తలవంచటమో, విధిని ఎదిరించటమో మీ సమాధానంపైన ఆధారపడి వుంటుంది!" అని స్పష్టంగానే అనేసి ఇంటికి వెళ్ళిపోయింది.

పెళ్ళికొట్టిన రాయిలా ఇంట్లోనే కూర్చున్నది సీత. వియ్యాలవారు బయట అరుగుల మీద కూర్చుని కబుర్లూ కాకరకాయలూ మాట్లాడుతుంటున్నారు. డప్పులు దొర్లించినట్లూ. రేకులు లాగినట్లూ వినిపిస్తున్నాయి ఆ శబ్దాలు. ఇంతలో "పురోహితులవారొచ్చినట్టున్నారండోయ్ బావగారూ!" అన్నాడు రామకోటి తండ్రి. సోమయాజులు "రండి, రండి!" అన్నాడు.

సీతకోసం వెదుకుతున్న కళ్ళతో జయరాం అప్పుడు ఇంట్లో కొచ్చాడు. జయరాం తన తండ్రికేసి చూస్తూ, "నాన్నా! ఓసారియిలారా!" అన్నాడు.

"ఏమిట్రా?" అంటూ దగ్గరికొచ్చాడు సోమయాజులు.

"వాళ్ళకు పెళ్ళివొద్దను నాన్నా!"

"బుద్ధిలేదట్రా నీకు? వాళ్ళతో తాంబూలాలు మార్చుకోబోతున్నామని తెలిసే మాట్లాడుతున్నావా?"

"తాంబూలాలు మార్చుకోవల్సింది వాళ్ళతో కాదు. సీత శేఖరం మేష్టార్ని చేసుకుంటుంది."

ఆ మాట విని సోమయాజులు నిశ్చేష్టుడైపోయాడు. మరుక్షణం తేరుకుని, "ఆ రెండో పెళ్ళివాణ్ణా!" అన్నాడు.

ఆ ఒక్కమాటకే తోకతొక్కిన తాచులా కస్సున లేచింది సీత. "అయితే. ఈ రామకోటి రెండో పెళ్ళివాడుకాదంటావా? ఈ రెండువారాలూ మానసికంగా నాచెల్లెలితో కాపరంచేసి. యిప్పుడు నా మెళ్లో తాళికడతానంటున్న ఈ రామకోటి రెండోపెళ్ళివాడు కాదంటావా? ఇప్పుడీయన్ని నేను కట్టుకుంటే, తమ్ముడి నాకు సవితికాక మరేమవుతుంది? శేఖరం మేష్టారి కంటే ఈయన ఎందులో ఎక్కువ? శేఖరం మేష్టారు రెండో పెళ్ళివాడే కావచ్చు, మానసిక వ్యభిచారం ఆయనకు తెలియదు. ఆయన కాలిగోటికైనా సరిపోతాడా నువ్వు తెచ్చిన పెళ్ళికొడుకు?"

కోపంతో వొణికిపోతున్న సీతను గట్టిగా పొదివి పట్టుకున్నాడు జయరాం.

తిప్పసముద్రంవాళ్ళ పుష్పక విమానంతిరుగుముఖం పట్టడానికి ఎంతోసేపు పట్టలేదు.

ఆనాటి వెన్నెలరేయిని ప్రశాంతత పెనవేసుకున్నది. సీత చేతినీళ్ళ చలువతో, శేఖరం వాకిట్లోని మల్లెచెట్టు రాత్రికి రాత్రే కొత్త పూపిరిపోసుకున్నది.

✱



ఎందుకు?

"ఆఫీసర్లు చీటికీ మాటికీ స్టెనోని ఎందుకు పిలుస్తారు?" అడిగాడు మురళి, మోహన్‌ని.

"వాళ్ళు రాస్తే స్పెల్లింగ్ మిస్టేక్స్ వస్తాయని..." తక్కువ చెప్పాడు మోహన్.

—కె. లక్ష్మణప్రసాద్ (విశాఖపట్నం)

కేక —శ్రీ

